AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

పంచాయతీలకు నిధులు విడుదల చేసిన కేంద్రం

అక్షరటుడే, ఢిల్లీ: గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన నిధులను విడుదల చేసింది. రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేస్తామని ఇటీవల కేంద్రం చెప్పిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో రెండేళ్లు ఆలస్యంగా జీపీ ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. సుమారు రూ.3 వేల కోట్లు రావాల్సి ఉంది. ఈ నిధులు వెనక్కి పోతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల ఎన్నికలు పెట్టింది. దీంతో తొలి విడతగా కేంద్రం రూ. 259.36 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డీజీపీ శివధర్‌రెడ్డి నియామకంపై సుప్రీం కీలక తీర్పు

అక్షరటుడే, హైదాబాద్: తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి నియామకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. శివధర్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 26న డీజీపీగా నియమించింది. ఆయనకు ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన నియామకం చెల్లదంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశాడు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తాత్కాలిక పద్ధతిలో డీజీపీని నియమించడానికి వీల్లేదని ఆయన వాదించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం డీజీపీ శివధర్‌రెడ్డి నియామకాన్ని రద్దు చేయడానికి నిరాకరించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది.

5-2-2026 (Thursday) MAIN EDITION

సైబర్ షీల్డ్ 2.0 సదస్సు

అక్షరటుడే, హైదరాబాద్: సైబర్ నేరాల నియంత్రణ, కట్టడి లక్ష్యంగా హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో షీల్డ్ 2.0 సదస్సు నిర్వహించారు. డీజీపీ శివధర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐ రోబోలను ప్రదర్శించారు. రోబో చేసిన విన్యాసాలు, డ్యాన్స్ ఆకట్టుకున్నాయి.

మేడారం హుండీల లెక్కింపు

అక్షరటుడే, వరంగల్: మేడారం జాతర హుండీల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. హన్మకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో మంత్రి కొండా సురేఖ కొబ్బరి కాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. ఈసారి మేడారంలో 788 హుండీలను అధికారులు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తమ కానుకలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నైజీరియాలో నరమేధం

అక్షరటుడే, నేషనల్ డెస్క్: నైజీరియాలో సాయుధమూక నరమేధం సృష్టించింది. రెండు గ్రామాల్లోని ప్రజలపై దాడులు చేసి.. 200 మందిని అతి దారుణంగా చంపేశారు. పలు ఇళ్లు, దుకాణాలను కూడా తగులబెట్టారు. అందులో వీధుల్లో పెద్దఎత్తున మృతదేహాలు పడి ఉన్నట్లు కన్పించాయి. ఈ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

గ్రూప్–1 నియామకాలపై ఉత్కంఠకు తెరపడింది. ఉద్యోగాలు సాధించినా.. సింగిల్ బెంచ్ తీర్పుతో ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఊరట లభించింది. పరీక్షలను రద్దు చేయాలన్న ఏకసభ్య ధర్మాసనం తీర్పును డివిజన్ బెంచ్ రద్దు చేసింది. దీంతో నియామక పత్రాలు పొందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

గ్రూప్–1పై ఈరోజు..

- నియామకాలు సక్రమమేనన్న హైకోర్టు
- సింగిల్ బెంచ్ తీర్పు సస్పెండ్
- 563 మంది అభ్యర్థుల హర్షం

గ్రూప్-1 నియామకాలపై సింగిల్ జడ్జి తీర్పును ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం రద్దు చేసింది. గ్రూప్ -1 ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో ఏకసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై గతంలో కోర్టు స్టే ఇవ్వగా.. తాజాగా తీర్పును కొట్టి వేసింది. గ్రూప్-1 నియామకాలు సక్రమమేనన్న పేర్కొంది. పరీక్షలు పారదర్శకంగానే జరిగాయని తెలిపింది. పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

వివాదం ఏమిటంటే?

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షపై పలువురు అభ్యర్థులు గతంలో కోర్టును ఆశ్రయించారు. జవాబు పత్రాల మూల్యాంకనం సక్రమంగా జరగలేదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ బెంచ్ ధర్మాసనం ర్యాంకులను రద్దు చేసింది. మళ్లీ పరీక్షలు పెట్టాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై టీజీపీఎస్సీతో పాటు ర్యాంకర్లు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు సేకరించిన కోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది.

నియామకాలు పూర్తి

సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై ద్విసభ్య ధర్మాసనం స్టే ఇవ్వడంతో ప్రభుత్వం అప్పుడే హడావుడిగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందించింది. అయితే కోర్టు తన ఉత్తర్వుల్లో తుది తీర్పునకు లోబడి నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. దీంతో కొలువులు సాధించిన అభ్యర్థులు తీర్పు కోసం ఉత్కంఠతో ఎదురు చూశారు. ఈ పిటిషన్‌పై విచారణ గతంలోనే ముగిసింది. జనవరి 22న తీర్పు వెలువడాల్సి ఉంది. అయితే తీర్పు రెడీ కాలేదని కోర్టు ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు గురువారం ఉదయం తీర్పు వెలువరించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులు కొట్టి వేయడంతో ఉద్యోగాలు పొందిన 563 మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొలిసారి పరీక్షలు

తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత తొలిసారి గ్రూప్-1 పరీక్షలు జరిగాయి. 2024 జూన్‌లో పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫలితాలు ప్రకటించి మెయిన్స్ కోసం అభ్యర్థులను ఎంపిక చేశారు. మెయిన్స్ పరీక్షలు 2024 అక్టోబరు 21 నుంచి 27 వరకు జరిగాయి. 2025 మార్చి 10న వీటి ఫలితాలు విడుదలయ్యాయి. అయితే కొందరు అభ్యర్థులు మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని కోర్టును ఆశ్రయించారు. దీంతో సింగిల్ బెంచ్ పరీక్షలను రద్దు చేయగా.. డివిజన్ బెంచ్ ఆ తీర్పును కొట్టి వేసింది.

సీఎం రేవంత్‌రెడ్డిపై కవిత ఆగ్రహం

అక్షరటుడే, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలమ జాతిపై ఆయన వ్యాఖ్యలను ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మిర్యాలగూడ సభలో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన కేసీఆర్ కుటుంబ సభ్యులపై విమర్శలు చేశారు. అంతేగాకుండా వెలమ కమ్యూనిటీపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా కవిత స్పందించారు. రేవంత్‌రెడ్డి అన్ని మర్యాదలను అతిక్రమించి మాట్లాడారని మండిపడ్డారు. వెలమ జాతిని టార్గెట్ చేస్తూ నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. అన్ని కులాలు, మతాలను సమానంగా చూడాల్సిన సీఎం వెలమలను టార్గెట్ చేయడం సరికాదన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఆయన సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం అందరికీ తెలుసన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన వర్గానికి చెందిన 30 మందికి ఎమ్మెల్యే కాంగ్రెస్ బీ ఫాంలను అందించారన్నారు. అలాంటి వ్యక్తి పార్టీ మారినట్లు ఆధారాలు లేవని క్లీన్ చిట్ ఇవ్వడం సరికాదన్నారు. సంజయ్‌కి నిజాయితీ ఉంటే పదవికి రాజీనామా చేయాలన్నారు. స్పీకర్ రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలని కోరారు.

జేపీ నడ్డా, ఖర్గే మధ్య మాటల యుద్ధం

అక్షరటుడే, నేషనల్ డెస్క్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. లోక్‌సభ, రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నరవాణే పుస్తకం గురించి చేసిన వ్యాఖ్యల ప్రకంపనలు ఆగడం లేదు. ఈ క్రమంలో గురువారం రాజ్యసభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మధ్య మాటల యుద్ధం సాగింది. లోక్‌సభలో రాహుల్ గాంధీని మాట్లాడనివ్వలేదని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అంటే కేంద్రం భయపడుతోందన్నారు. దీనిపై నడ్డా స్పందించారు. లోక్‌సభ అంశాలను ఇక్కడ ప్రస్తావించొద్దన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. కీలక నేత హతం!

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: మావోయిస్ట్‌లకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక నేత హతం అయ్యారు. బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్‌లో గురువారం ఉదయం ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. బలగాలు ఒక నక్సలైట్ మృతదేహాన్ని, ఎకే-47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఆపరేషన్ ముగిసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. కాగా.. ఈ ఎన్‌కౌంటర్‌లో నక్సల్ కమాండర్, ఈ ప్రాంతంలో చురుగ్గా ఉన్న అగ్ర నాయకుడు ఉధమ్ సింగ్ చనిపోయినట్లు సమాచారం.

రీల్స్ పిచ్చి.. బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

అక్షరటుడే, ఏపీ: సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి చాలా మంది ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఓ యువకుడు రీల్స్ చేస్తూ బైక్‌పై నుంచి పడి మృతి చెందాడు. కడప జిల్లాలో బుధవారం తెల్లవారుజామున కొందరు యువకులు బైక్‌లతో ప్రమాదకరంగా స్టంట్లు చేశారు. ఈ క్రమంలో ముబారక్ (20) అనే యువకుడు కింద పడి చనిపోయాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడికి సైతం తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కడప పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుడే పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేయాలి

అక్షరటుడే, హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేసే ముందు వివరణ ఇవ్వాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పవన్ కళ్యాణ్ గతంలో తెలంగాణ గురించి చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజలు మర్చిపోయారని తాను అనుకోవట్లేదన్నారు. ఒక సినిమా నటుడుగా మాత్రమే పవన్ కళ్యాణ్ ను ఆరిస్తామని చెప్పారు. తాను చిరంజీవి అభిమానిని అని అన్నారు. కానీ అనుచిత వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన తరువాతనే పవన్ ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి దిక్కులేదని.. అందుకే పవన్ వద్దకు వెళ్లి మోకరిల్లారని విమర్శించారు. ఇదిలా ఉంటే పవన్ కొన్ని నెలల క్రితం కోనసీమలో జరిగిన ఓ సభలో మాట్లాడుతూ.. కోనసీమ కొబ్బరి చెట్లకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలిందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

అల్లు అర్జున్ మూవీ సెట్స్‌లోకి రష్మిక..

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచరస్ మూవీగా రూపొందు తున్న ఈ చితంపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలో నటించే హీరోయిన్ల గురించి ఓ క్రేజీ వార్త సోషల్ మీడి యాలో చక్కర్లు కొడుతోంది. ఇప్ప టికే బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొనే హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలి సిందే. ఆమెతో పాటుగా మరో ముగ్గురు కథానాయికలు ఈ చిత్రంలో నటించనున్నారని ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించాయి. అయితే తాజాగా రష్మిక ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక మందన మంగళవారం బన్నీ-అట్లీ సినిమా సెట్స్‌లో చేరిందని, ముంబైలో షూటింగ్ జరుగుతోందని తెలుస్తోంది.

–అక్షరటుడే, సినిమాడెస్క్

కాంగ్రెస్‌కు తెలంగాణ బంగారు బాతు: కిషన్‌రెడ్డి

అక్షరటుడే, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతుగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే డబ్బులు వెళుతున్నట్లు ఆరోపించారు. తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటేయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏం చేసిందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.